# మరువలేని సంఘటన



'జీవితంలో మరువలేని సంఘటనకు ఉదాహరణ చెప్ప వోయ్!"

"అదిగో! వెళ్తూందే ముచ్చర్ల అరుణ... ఆమె పేరేమిటో తెలియదు కాబట్టి అచ్చు సీతాకోకచిలక సినిమాలో హీరో యిన్‌లా వుంది.

అందుకని ఆ పేరనుకొందాం! ఆమె దగ్గర కెళ్ళి 'అయ్ లవ్ యు!' అనగానే ఫెడీల్మని చెంప దెబ్బ తినడమే నీ ప్రశ్నకు సమాధానం...."

"అదేదో థియరీలా కాకుండా ప్రాక్టికల్‌గా చేసి చూడరాదూ! మనం అనుకున్నట్టు ముచ్చర్ల అరుణ... అదే ఆ వెళ్ళే అమ్మాయి రెస్పాన్స్ ఎలా వుంటుందో... రేపు పెళ్ళయ్యాక మనం కలుసుకున్నప్పుడు తీపి గుర్తుగా గుర్తు చేసుకోను వీలుంటుంది..."

"అంతేనంటావా? సరే– ఇక్కడ్నే వుండు. ముచ్చర్ల అరుణ సంగతేమిటో తేల్చుకొస్తాను..."

ఉత్తుత్తి కబుర్ల పోగు కాదు వసంతరావు. చేతలకాడని నిరూపించేందుకు మిత్రుడు కోరడమే తడవు పిట్టగోడ దూకి అల్లంత దూరాన వెళ్తున్న అమ్మాయి వెనుకపడ్డాడు.

'వీడెళ్ళి ఏం వాగుతాడో? ఆ అమ్మాయి చెయ్యి చేసుకుంటుందని గేరంటీ ఎక్కడుంది? కాలి చెప్పతో సత్కరించినా ఆశ్చర్యపడనక్ఖర్లేదేమో...' మొదటే పిరికివాడు దాసు.

అయితే ఎదుటివారిని సాహసాలు చేయమని ఎగదోయడంలో మహ దిట్ట.

ఇప్పుడూ అలాగే వసంతరావును ఎగదోసి, అతను మగటిమితో రొమ్ము విరుచుకు ముందుకు వెళ్తుంటే తను మాత్రం ఊపిరి బిగబట్టి అటే చూడ సాగాడు, ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠతో.

వసంతరావేం తెలివితక్కువవాడు కాదు. దాసు బలహీనత తెలిసినవాడే కాబట్టి అతనికి గట్టిగా బుద్ధి చెప్పాలన్న ఉద్దేశ్యంతో సరాసరి ఆ అమ్మాయిని సమీపించి

"ప్లీజ్! కాస్తాగుతారా..." అని సవినయంగా మనవి చేసుకున్నాడు. ఆ అమ్మాయి 'ఏమిటి సంగతి? ' అన్నట్టుగా కళ్ళెగరేస్తూ ధీమాగా నిలబడగానే (మరి ఈకాలం ఆడపిల్లా... మజాకా!?) మిత్రునితో సంవాదము, విషయం ఇంతదాకా రావడం సవిస్తరంగా చెప్పకొచ్చి "మీరేం అనుకోకుంటే మీ చేతిని నేను పట్టుకుంటాను! మీకు కాస్త దగ్గరగానూ జరుగుతాను. జస్ట్ బ్రదర్నే అనుకోండి! మీ దగ్గర్నుంచెళ్ళాక వాడిని మీ దగ్గరకు పంపుతాను. మీరు చెంపదెబ్బ కొడ్తారో, కాలి చెప్పతో సత్కరిస్తారో ఆ పై మీ ఇష్టం! ఇంకెన్నడూ రాస్కేల్ నన్ను ఇలా వురికొల్పకూడదు. నాతో సహకరించరూ, ప్లీజ్..."



వసంతరావు అదృష్టం కొద్దీ ఆ అమ్మాయి ఇలాంటి బుద్ధి చెప్పడాలు, నాటకీయతలపై ఇంట్రెస్ట్ వున్నది కాబట్టి "రైటో! ప్రోసీడ్ మ్యాన్..." గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది.

"థ్యాంక్యూ సిస్టర్! అన్నట్లు మీ పేరేమిటో నేను తెలుసుకోవచ్చా?"

"ముచ్చర్ల అరుణ" ఆమె నవ్వుతూ సమాధానమిచ్చింది.

"వ్వాట్! నిజంగానే... ఒకవేళ పిట్టగోడ మీద మా సంభాషణ విన్నారా?!"

"మీ మాటలు వినడమే జరిగింది కానీ, నా పేరు వల్లరి. ముందతన్ని ఇటు పంపు! చూస్తాండు, ఆ పై ఏం జరుగుతుందో..."

'హమ్మో! నువ్వు వల్లరి కాదు. అల్లరి పిల్లంటే సరిపోయేట్లుంది...' అనుకొంటూ మిత్రుణ్ణి సమీపించాడు వసంతరావు.

ఆ సరికే అతను ముచ్చర్ల అరుణను సమీపించడం, ఆమెను విలేసి ఏదో హస్కు వేయడం, ఇద్దరూ నవ్వు ముఖాలతో చేయీ చేయీ కలువుకోవడం, దగ్గరవ్వడం అంతా గమనించిన దాసు 'ఇది తప్పకుండా కేసే!' అని నిర్ణయానికి వచ్చేశాడు.

అతని ఉద్దేశ్యాన్ని బలపరిచాడు దరి చేరిన మిత్రుడు. "విన్నూ రమ్మంటోందిరా ఆ పిల్ల! మనిద్దరం ఓ చోటికి వస్తే తను సిద్ధమేనా అని మాట్లాడాను. ముందు ఒ.కే. అంది. అంతలోనే ఏమైందో, విన్నూ దగ్గరకు రమ్మంది. ఏదో చెబుతుందట. వెళ్ళురా.. వెళ్ళు... రసగుల్లాలా వుంది గుంట, మరీ దగ్గరగా విల్చొని చూస్తుంటే..." అతను ఎగదోస్తుంటే ఇక నిలవలేకపోయాడు దాసు.

తన పిరికితనం ఎటుపోయిందో!

ఆ దే పిలుస్తుంటే వెళ్ళకపోవడం తన మగతనానికే అవమానమన్నట్టు ధీమాగా నడుస్తూ వెళ్ళి ఆమెను సమీపించాడు. అంతదాకా సినీ తాజా హీరోయిన్‌లా నాలుక బయటికి, లోపలికి ఆడిస్తూ, మూతి కాస్త పక్కగా జరిపి కొంటె నవ్వుతో, రొమాంటిక్ చూపులతో ఇద్దరి కదలికల్నీ గమనిస్తోంది వల్లరి.

ఎప్పుడైతే దాసు ఆమెను సమీపించాడో అతనితో ఏం మాట్లాడిందో ఏమో, కొద్ది నిమిషాల్లోనే అతనితో కల్పి వసంతరావును సమీపించడమే తడవు అనుకోని పరిణామంగా ఇద్దరి మెడలు దొరకపుచ్చుకుంది.

"రాస్కెల్స్! దారిని పోయే ఆడదంటే ఇలా చులకనట్రా మీకు! విడివిడిగా మీ గేమ్స్ ఆడడానికి పరాయి ఆడపిల్ల కావాల్సొచ్చిందా? బుద్ధిగా చదువుకొని ఉద్యోగాలు సంపాదించుకునే ప్రయత్నాలేవో చూసుకోక ఇలా రోడ్ సైడ్ పిట్టగోడల మీద కూర్చోవడం, దార్నెల్లే ఆడపిల్లల్ని మీ గేమ్‌కు ఆట బొమ్మలుగా వాడుకోచూస్తారా? పదండి స్టేషన్‌కీ..." ఉరుములా గద్దిస్తూ కొంగులో దాచిన విజిల్ తీసి గట్టిగా ఊదింది.

ఆపై ఇంకేముంది?

పక్క సందులోంచి పోలీస్ జీప్ అక్కడ వాలడం, ఈ ఇద్దర్నీ అందులోకి నెట్టి స్టేషన్‌కు లాక్కెళ్ళడం చూస్తుండగానే జరిగిపోయింది.

ఆ సాయంత్రం నుంచి రాత్రంతా లాకప్‌లోనే వుంచి మరునాటి ఉదయాన్నే "ఇకపై ఇలా రోడ్లమ్మట కనిపిస్తే నెల రోజులు శిక్ష వుంటుంది, జాగ్రత్త!" అని ఓ వార్నింగిచ్చి మరీ వదిలింది బూరెల బుగ్గల ముచ్చర్ల అరుణ ఉరఫ్ వల్లరి ఉరఫ్ పోలీస్ అమ్మడు.

వాడిన ముఖాలతో ఇంటిదారి పట్టారు మిత్రులిద్దరూ.

"జీవితంలో మరువలేని సంఘటనకు ఇదో ఉదాహరణే... ఏమంటావ్‌రా వాసూ?"

"ఇంకేమంటాను? కరెక్టే అంటానురా బాసూ!"

'రాత్రంతా ఎక్కడికి పోయావురా అని ఇంట్లో వాళ్ళడిగితే ఏం చెప్పాలిరా భగవంతుడా?' పైకి చెప్పకోక పోయినా ఇద్దరి మనసుల్లోనూ దారి పొడుగూతా ఇదే బాధ.

– వేలూరు మునుస్వామి

# సాక్షాత్కారం

– డాక్టర్ దేవరాజు మహారాజు

ఆలోచన అక్షర భాషలోకి రావడమే ఒక అనువాదం
అది శబ్ద రూపంగా, దృశ్యమయంగా మారడం
అనువాదానికి చేసిన అనువాదం
జంత్ర వాద్య సమ్మేళనమంతా
నరాల మీద నర్తించే హృదయానువాదం
అనువాదం – రెండు ముఖాలున్న నాణెం!
టెలిగ్రాఫ్ టకటకలు ...
గుండె ఆగిపొయ్యే భయంకర వార్త కావొచ్చు
మది వులకించే మధుర భావనా కావొచ్చు
అనువాదమయ్యేదాకా అంతుపట్టదు అసలు విషయం.

చెక్కును అనువదించి చూడండి
కనక వర్షం కురిపిస్తోందో లేదో
రూపాయల్ని సుఖాలుగా అనువదించుకునే వాడికి
సుఖం లేదుట –
చెమటను రూపాయిగా మార్చుకుంటున్నవాడికి మాత్రం
తిండి లేదు!
ఈ అనువాద ప్రపంచంలో దేనికి ఏది సరిపోతుందో
ఎంతకూ అంతుపట్టదు

రోడ్డు మీద మనిషి చప్పట్లు
ఎటు వెళ్తున్నావన్న వేలి సౌంజ్ఞ
చేయి చేయి కలపడం
చేతులు సాచి కౌగలించుకోవడం
అందమైన అనువాదాలే కదా!

హృదయం ఒక గొప్ప అనుభూతి సాధనమైనట్లే
కంప్యూటర్ ఒక గొప్ప అనువాద సాధనం
విద్యుత్తు, ఎన్ని రకాల భాషల్లోనైనా అనువదింపబడుతుంది

ఒకానొక హృదయ వేదనకు
చేసిన సరళమైన అనువాదం – కన్నీరు
బాధను మరో భాషలోకి
మార్చిన భాష – కవిత్వం
ప్రయాణపు నిర్ణయాల్ని వాహనాలే కాదు,
కాలం కూడా అనువదించాలి
మూలం ఏదో, అదే నిర్దేశించాలి
ధ్యేయపు అనువాదాన్ని–
నిన్ను నువ్వు పోల్చుకుని చూసుకోవడానికి
అధ్యయనం చేసుకోవడానికి
అద్దపు అనువాదం కావాలన్నారు కొందరు
మానవ సేవే మాధవ సేవగా
ప్రతిబింబిస్తుందన్నారు పెద్దలు.

నువ్వీ చీకటిని తేజోవంతం చేయడానికి
నువ్వే దీపం కాక తప్పదు –
వెలుగుంటేనే కదా
ప్రతిబింబమైనా, పరావర్తనమైనా సాధ్యమయ్యేది?